మరోవైపు, ద్వంద్వ విధి నిర్వహణ కష్ట సాధ్యమవుతుంది గదా. ఇంకా, రేపు జరుపబోయే సత్యాగ్రహాన్ని దాదాపొక, "ప్రత్యక్ష చర్య"గా జరుపవలసిన తరుణంగూడ వచ్చింది. మరి తీర్మానాలకు, డెప్యుటేషన్లకు, దీక్షా చర్యలకు చలించని కాంగ్రెస్ ప్రభుత్వం, అప్పటికిగదా తెలివికొచ్చేది.

కాగా స్వామీజీ తలపెట్టిన సర్వపక్ష ప్రజాప్రతినిధుల సమావేశంలో, నేటి ఈ జాతీయోద్యమ సమస్యను సాకల్యంగా చర్చించి నిర్ణీత కార్యక్రమంద్వారా, విజయవంతంగా ముందుకు తీసికొని పోవలసిన బాధ్యత ప్రతి తెలుగుబిడ్డపై యీనాడధికంగా ఉంది. ప్రజాభిమానాన్ని మాత్రమే ఇంతవరకు వ్యక్తిగతంగా చూరగొన్న పండిట్‌జీకి, ప్రజాశక్తి పటుత్వాన్నిగూడ ప్రదర్శించాల్సిన అదృష్టం ఆంధ్రులకు దక్కింది. లేనిచో రాష్ట్ర విభజనను, స్వీయాపరాధముగు దేశవిభజనతో పోల్చి ఒక వైపున హామీలిస్తూ, మరోవైపున తొంటి చెయ్యి చూపించే పరిస్థితికి దిగజారరు. ఎంత పరస్పర విరుద్ధభావాలతో సతమతమవుతున్నా ఏ జాతియైనా తన జాతీయోద్యమ విషయంలో ముక్తకంఠంతో పనిచేస్తుందనే సత్యం నెహ్రూజీ మరచిపోవటం అసంభవం. కాగా రాష్ట్ర సమస్య, ముక్కోటి ఆంధ్రుల జాతీయోద్యమమని ఘంటాపథంగా చాటవలసిన సమయం వచ్చింది.

"విశాలాంధ్రకు" రూపురేఖలు దిద్దిన కమ్యూనిస్టు ప్రతినిధులు, ఆంధ్రోద్యమానికి భీష్మాచార్యులను ఆంధ్ర కేసరి అనుయాయులొకవైపు, తెలుగుతల్లి అనుంగుతనయులగు రైతులోకం మరోవైపు పూని దీక్షాధారులైననాడు, ఆంధ్ర వాంఛితాన్ని అవరోధించే శక్తి ఉండబోదు. గడప గడపకు యెన్నికల ప్రచారం యెల్లా జరిగిందో, రాష్ట్ర సాధనా దీక్షా ప్రచారం గూడ అల్లా జరపటానికే తమను ప్రజలెన్నుకున్నారన్న సత్యం మరువరాదు. ముప్ఫయి సంవత్సరాలనుంచి కారణాంతరాలవల్ల, కుంటి నడక సాగిన జాతీయోద్యమ రథగమనాన్ని త్వరిత పరచి "ఆంధ్రరాష్ట్రం తెచ్చుకోటం ఆంధ్రుల చేతిలో ఉన్నదన్న" నెహ్రూ సవాలును నిరూపించే బాధ్యత, నేటి ప్రజా ప్రతినిధులపైన, ముఖ్యంగా వామపక్ష ప్రజలపైన ఉన్నది.

కథానిక

# చాలని రోజులు

సిద్ధాంతి మల్లికార్జునం

ఇలాంటి వార్త యీ జన్మలో వింటానని కలలోగూడా అనుకోలేదు. గ్రహచారం. చాలని రోజులొస్తే అంతేకాబోలు! ఎంత సమాధాన పరచుకుందామన్నా వీలు కావడం లేదు. నిజమే! ఎలా అవుతుంది. నాబోటి వాళ్లకి కల్పవృక్షంలాగా వుంటూండే ఆ ఏనుగంత వ్యక్తికి గతిపట్టిందంటే యింకేమనుకోవాలి.

నిజానికినాడు నా మనస్సాక్షిగా చెబుతున్నాను. నేనీమాత్రం యివ్వాళ మీ కంటికి కనబడుతున్నానంటే యిదంతా ఆ మహా పురుషుడివల్లనే. ఎన్ని జన్మాల కతని ఋణం తీర్చుకోగలనో నాకేమీ పాలుపోవడం లేదు. ఈ లోకంలో ధర్మాత్ములు చాలాకాలం వుండరనే సామెత వారి విషయంలో సార్థకమైంది.

అసలు పాపికొండల ధర్మరాజుగారివంటి వ్యక్తి మళ్ళీ యీ పాపిష్టి భూలోకంలో జన్మించడమనేది కల్ల. ఆయన పూజ్య బాపూజీకంటే 30 ఏళ్లు చిన్న! బాపూజీ రాజకీయ రంగంలో అడుగుబెట్టిన మరుక్షణమే, యీ ధర్మరాజుగారు మనోవాక్కాయకర్మలద్వారా ఆయనకు శిష్యులైనారు. ఇలాంటి శిష్యులకు ఆంధ్ర దేశంలో ఏనాడూ కొదవలేదు సరిగదా. మా ధర్మరాజుగారంటే బాపూజీకి అపరిమితమైన అభిమానం.

మా తాలుకాలోని అమాయకుల కందరికీ

దేశభక్తిని బోధించి ఒక త్రోవలో పెట్టిన వ్యక్తి అతడే. అటు పేదవాళ్లకీ యిటు శ్రీమంతులకీ ఆయన కల్పవృక్షమే. సద్గుణమంటే ఆయనదే!

మొన్న స్వాతంత్ర్యం వచ్చిన నాటినుండి ఆయన ప్రతిభ మా తాలూకా ప్రతిభ దివిటీలా వెలిగిపోతున్నాయి. ఒక్క పాడుకొంప మా వూరు మొట్టమొదటినుంచి, కాని యిప్పుడదొక గొప్ప పట్టణం. ఎంత వ్యాపారం వృద్ధిచెందింది! ఎన్ని అంతస్థులుగల మేడలు లేచాయి! ఎన్ని మోటారుకార్లు, ఎన్ని బస్సులు, ఎన్ని బట్టల దుకాణాలు, ఎన్ని సహకార సంఘాలు, ఎన్ని దీపాలు. ఇంకెందుకు లెండి మావూరొక జివేంద్రుని ముఖ్య పట్టణమైంది. అంతకుముందు పర్మిట్లు, లైసెన్సులు, అన్న మాటలే తెలియని మా పాడుకొంపనిండా యిప్పుడీ శబ్దాలే వినవస్తూంటాయి. ఏదో ఒక లైసెన్సుగాని పర్మిట్టుగాని లేనివ్యక్తి మీకంటి కగపడటం చాలా అరుదైన విషయం.

అదీ యెందుకంటారేమో, ఏదో ఒకటి అంత మహారాజు వూళ్లోవుండగా తెప్పించుకోలేని మొగతనం యెందుకు? అదీ లేనివాడు యెక్కడున్నావే గొంగళీ అంటే వేసిన చోటనేవున్నానన్నట్లుగానే వుంటాడు. అసలు నా సంగతి చూడండి:

నేను మొదట బంకుపెట్టుకొని తమలపాకు కిళ్ళీలు పిప్పరమింట్లు అమ్ముకుంటూ కాలక్షేపం చేస్తూ వచ్చాను. తర్వాత దైవానుగ్రహంవల్ల కాస్త వితంతువుల ఆస్తి నాకు దక్కడం దానితో బట్టలవ్యాపారంలో దిగాలనే కోర్కె కలగడం అందుకు తపస్సు చెయ్యడం, ధర్మరాజుగారు దర్శనమిచ్చి లాంగ్ క్లాత్, మల్లు, వగైరా లైసెన్సుల వరాన్ని నాకివ్వడం జరిగింది. అసలు పట్టు దొరకాలేగాని పైకి ప్రాకిపోవడం యెంతసేపు.

ధర్మరాజుగారి ధర్మబుద్ధివల్ల నాకు చక్కెర టోకువ్యాపారం పర్మిట్టు, తర్వాత మందుల షాపు పర్మిట్టు ఆపైన మోటారుకార్ల పర్మిట్టు, యిలాగే పద్దన్న కొద్దీ వచ్చి నానెత్తినపడ్డాయి. సిరిరా మోకాలొడ్డువారుందురా అన్నట్లు, ఏంచేసేది నేను ఒప్పుకొని తీరవలసివచ్చింది.

ఇప్పుడు నాకు రెండుకార్లు, నాలుగుమేడలు 8 రకాల వ్యాపారం, 16 ఎకరాల మాగాణి 32 ఏజెన్సీలు, 64 లైసెన్సులు పర్మిట్లు. మొన్ననే మావూళ్ళో ఆడపిల్లల బడికి అనాథ, వితంతు శరణాలయాలకు విరాళాలిస్తానని ప్రమాణం చేశాను.

ఏదో అన్నీ యిలా చక్కగా జరిగిపోయ్యే రోజుల్లో పిడుగులాంటి వార్త నా చెవిలో పడేసరికి నా కాళ్లుచేతులు చల్లపడ్డాయి. ధర్మరాజుగారికొరకు నేను ఎన్నివేలు ఖర్చుచేశాను. ఎంతమంది కెన్నివాగ్దానాలు చేశాను. రాత్రింబవళ్లు నిద్రాహారాలు మాని పనిచేశాను. కాని నాగీత బాగాలేదు. నిజానికి ఓడిపోయింది ధర్మరాజు గాదు, నేను.

నాకష్టాని కెంతమంది సానుభూతి చూపిందీ తెలపవలెనంటే అది ఎల్లకాని పని. ఇక నా మొహం చూచేవాళ్లెవరు? నా మొరాలకించేవాళ్ళెవరు?

పాపం ఆ మహారాజు ఎన్నిటికి అడ్డుపడి నా ప్రాణం కాపాడాడు. ఇన్‌కమ్‌టాక్సు యెగవెయ్యడానికి ఆయన నాకు సాయం చేసినట్లు మరెవ్వరికీ చెయ్యలేదన్న సంగతి నాకు రూఢిగా తెలుసు. ఒక్కటే పడ్డ పర్మిట్టుతో యెన్నిపుట్ల ధాన్యం మా తాలూకానుంచి అవతలికి దాటించానో ఎన్నిమాట్లు నాకు ఆయన సాయపడ్డాడో లెక్కలేదు. బస్తాల్లో అడుగున సన్నటి యిసుకపోసి పైన చక్కెరపోసి రవాణాచేసే సందర్భంలో పట్టుబడితే ఆ పాపికొండల ధర్మరాజు వచ్చి నా ప్రాణం కాపాడినాడేగాని దేవుడైనా నా ప్రాణానికి అడ్డువచ్చాడా?

ఇక లేదు. ఆ జ్యోతి అట్టే ఆరిపోయింది. నా యీ జ్యోతి ఆరిపోతుందేమో ననిపిస్తుంది.

ధర్మరాజుగారి ఓటమి తెలియడంతోటే అప్పుడు వారు మద్రాసు ఆసుపత్రిలో వుంటే స్వయంగా వెళ్లి నా సంతాప సానుభూతులను తెలుపుకుందామని బయలుదేరాను. సమయానికి కార్లు యింటి దగ్గర లేకపోవడంములాన రైల్లోనే వెళ్లాల్సొచ్చింది. నేనెప్పుడు రైల్లో వెళ్లడం తటస్థించినా మన పూజ్య బాపూజీ లాగా మూడవ తరగతి పెట్టెలో

వెళ్తానేగాని డబ్బున్నదనే ధీమాతో రెండో తరగతిలో వెళ్ళను. సామాన్య ప్రజలతో కలిసి మెలిసి తిరగడమే నా ఆశయం. అందుచేత ఆ నాటి లోకల్ బండిలో బైలుదేరాను మెడ్రాసుకు. మా పెట్టెలో ఒక కమ్యూనిస్టువాడు ఎక్కాడు. అబ్బ! ఆ పేరు వింటే, ఆరు అంగుళాల జెర్రులు, కొండెలు పైకెత్తుకొని పరుగెత్తే ఎర్రటి తేళ్లు నా వంటిమీద ప్రాకినట్లుంటుంది. వాళ్ళంటే నాకళ్లు చీకట్లు కమ్ముతాయి. ఒకటి రెండు మాట్లు మావూళ్ళో యీ కమ్యూనిస్టు వాళ్లు మీటింగులు పెట్టడానికొస్తే నాకు భయంపుట్టి నామీదికి మాత్రం రావద్దని కొంత డబ్బిచ్చి వాళ్ళను పంపించాను. ఇదంతా సరే గదా, మా రెండో కొడుక్కి కూడా యీ కమ్యూనిస్టు భూతం ఆవేశించింది. చదువు సంధ్య లేని సన్యాసుల కింకేం పనుంది.

ఈ కమ్యూనిస్టువాళ్లు ఎక్కడ చేరినా వూరుకుండే ఘటాలు కాదు. ఏదో అందరిలాగే తనూ ఆ పెట్టెలో కూర్చొని కావలసిన చోటికి పోరాదు. అదంతా లేకుండా పక్కనుండే వాళ్లందరినీ చేరదీసుకొని ఉపన్యాసాలు ప్రారంభించాడు. అదేం చిత్రమోగాని వాళ్లు నోరు మెదిలిస్తే యీగల్లాగా వాళ్ళచుట్టూ అలబరి జనమంతా అలా మూగుతారెందుకో!

ఇక వారి వుపన్యాసం వుందికదా, గప్పాల పుట్ట. ఏమి కోస్తున్నాడు వీడి తలకాయ. కమ్యూనిస్టువాళ్ల చేతికి అధికారం వస్తే యీ చక్కెర పర్మిట్లు, బియ్యం రేషను షాపులు తీసేస్తారట. ఎక్కడికిపోయినా అంతా నా వుసురు పోసుకొని చచ్చేవాళ్ళే. బియ్యం, చక్కెర, గోధుమ మొదలైనవన్నీ గవర్నమెంటువాళ్ళ షాపుల్లోనే అమ్మిస్తారట. మార్కెట్లమీద యినస్పెక్టర్లను పెట్టి తప్పుడు తూకాలు, తప్పుడు కొలతలు లేకుండా చేస్తారట. పూరి గుడిసెలమీద పన్నులు నూటికి తొంభైపాళ్లు తగ్గిస్తారట. పెద్దపెద్ద అంతస్థులుగల మేడల మీద పన్ను మూడింతలు చేస్తారట. మోటారు కారుండేవాళ్ళమీద యింకో పన్ను వేస్తారట. వాళ్లు నిర్ణయించిన దానికంటే ఎక్కువ పశువులుంటే వాటిమీద కూడా పన్ను విధిస్తారట. వీళ్ళ ఆత్రం యెలా వుందో చూడండి. ఇంత కష్టపడి చమటోడ్చి అందరి కాళ్ళకు దండాలు దస్కాలు పెట్టి నాలుగు రూకలు సంపాదించుకుంటే నాబోటి నోరులేనివాళ్ళమీదికి ధ్వజమెత్తుతారట వీళ్లు! ఏం కలియుగమండీ యిది!

తర్వాత, పెద్ద ఆఫీసర్ల జీతాలు సగానికి సగం తగ్గించి చిన్నచిన్న వాళ్ళ జీతాలు యెక్కువ చేస్తారట. ఈ సన్నగాళ్లు మొన్న పది రూపాల జీతం యెక్కువయ్యేసరికే పలకడం మానుకున్నారు. వీళ్ళింకా జీతాలెక్కిస్తే అసలే చెప్పినమాట వింటారా?

పెళ్లి జరిగేట్లయితే ఒక శుభలేఖ గవర్నమెంటువాళ్లకు పంపాలట. దేనికని యెవడో అడిగితే గవర్నమెంటుఆఫీసులో రికార్డులుండాలన్నాడు. ఆశుభలేఖమీద వధూవరులసంతకాలో నిశానీలో తప్పక వుండాల్సిందేనట. ఇదెక్కడి పాపకాలమో నా కర్థం కాలేదు. నేనూ నాలుగైదుమాట్లు పెళ్ళి చేసుకున్నాగాని యీ పిచ్చి వేషాలన్నీ యెప్పుడూ లేవు. పెద్దపెద్ద ఆస్తిగల వాళ్లెవరైనా, వారసుల్లేక చస్తే వాళ్ళ ఆస్తి అంతా గవర్నమెంటు హస్తగతమౌతుందట. ఒకవేళ అలా కాకపోయినా, వాడివాడి ఆస్తిపాస్తులనుబట్టి గవర్నమెంటు కొంతధనం వాళ్ల దగ్గరినుంచి వసూలు చేస్తుందట. ఎంత అన్యాయమండీ యిది.

రెండు యిళ్లకంటే పైన వుండేవాళ్ల నెత్తిన మరొక పన్ను వేస్తారట. బ్లాక్ మార్కెట్లో వ్యాపారంచేసేవాళ్లమీద సి. ఐ. డి లను పెట్టి, కేసు రుజువైనవాళ్ళని అండమాన్ దీవులకు పంపిస్తారట. అలాంటివాళ్లకు జామీను యివ్వడం పనికిరాదట. జామీను యిచ్చేవాళ్లను కూడా నేరస్థులుగా పరిగణించి యిద్దర్నీ ఒకే చోటికి పంపిస్తారట పాపం. పాపి కొండల ధర్మరాజు యిలాంటి ఆపత్కాలంలో గజేంద్రుణ్ణి విష్ణుమూర్తి రక్షించినట్లు నన్ను యెన్ని పర్యాయాలు కాపాడి పుణ్యం కట్టుకున్నాడు. ఇక యీ రాక్షసుల చేతుల్లో నాబోటి అమాయక పసిబిడ్డలు బతకగలరా. అందుకే మొన్న యెన్నికలలో నెత్తిన నోరుపెట్టుకొని యీ కమ్యూనిస్టుల గుండెగాలన్నీ బాగా ఏకరువు పెట్టా. ఏం లాభం?

పల్లెటూళ్లలో మొదట చిన్నచిన్న రైతుల

పొలాలకు నీళ్లు పెట్టిన తర్వాతేనట పెద్ద రైతుల పొలాలకు నీళ్లు విడిచేది! ఒకటి రెండు యెకరాలవాళ్లు నష్టపడ్డా ప్రపంచానికేమీ లోటు రాదు కాని యిలాగైతే నాబోటి, నాకంటే పైవాళ్లు యీ కమ్యూనిస్టు రాజ్యంలో గడ్డి తినరు? వాళ్లెంత నష్టపడతారో వీళ్లకి తెలుసా.

ఇంతేగాదట. అయిదు ఆరు వందల ఎకరాల భూములు గల రైతులుంటే వాళ్ళ భూములన్నిటిని సర్కారు వశపరచుకొని ట్రాక్టర్లు పెట్టి సేద్యం చేయించి ధాన్యం బజారు కేస్తారట. ఇలాగైతే మా ధర్మరాజు మంట గలుస్తాడు... ఆయన వెంబడి నేనూ కాబోలు.

చిన్న చిన్న ఉద్యోగస్తులమీద వేసే వృత్తి పన్ను రద్దుచేస్తారట. ఇకమీదట ఏ ఫ్యాక్టరీ గాని సర్కారువాళ్లు స్థాపించవలసిందే గాని యితరులు స్థాపించకూడదట. ఇప్పుడున్న ఫ్యాక్టరీలలో పనివాళ్ళకి గవర్నమెంటు నిర్ణయించిన జీతాలు యిస్తే సరే లేకపోతే ఆ ఫ్యాక్టరీని దానికి సంబంధించిన ఆస్తిపాస్తులను అన్నిటినీ ప్రభుత్వం వశపరచుకొని, తానే నడుపుతుందట.

ఎవరికైనా యెక్కువ కాళీ స్థలాలుంటే వాట్లలోకి వెళ్ళి ఉచితంగా బీదవాళ్లు యిళ్లు కట్టుకునేట్లు ఏర్పాటు చేస్తారట. అలా యిళ్లు కట్టుకునేవాళ్ళకి ప్రభుత్వం కొంత డబ్బు వూరికే పంచిపెడుతుందట.

ఇంత అన్యాయమా! మా ధర్మరాజు గనక ముఖ్యమంత్రి అయితే యింత అన్యాయం జరగనిస్తాడా. రామరామ. యెలాంటి పాపిష్టి కాలంలో బతుకుతున్నామురా భగవంతుడా!

పెద్ద పెద్ద బంగళాలలో యిద్దరో ముగ్గురో గనక నివసిస్తూవుంటే, న్యాయంగా ఆ ముగ్గురికీ కావలసిన చోటును వదలి తక్కిన భాగాన్నంతా చిన్న చిన్న కాపరాలుండేలాగు విభజించి అద్దెకిప్పిస్తారట.

ఇదంతా వింటూంటే నాకు అరికాలి మంట నెత్తికెక్కుతూంది. ఒక్క గంతేసి వాడిమీద పడి గొంతు పిసికేస్తామా అన్న ధైర్యం నాలో పొంగుతూంది. నేనిలా అనుకుంటూండగా నా చేతి రాళ్ళ వుంగరాలమీద పడ్డాయి వాడి కళ్లు. తర్వాత నన్ను తేరిపార చూచాడు. వాడితోపాటు అందరు నన్ను చూడసాగారు. ఎందుకో అనుమానం వేసి నాడి చూసుకున్నా. కాని అది పూర్తిగా ఆగిపోలేదు. నా మొహాన చెమటలు నా బెదురు చూపులు కాళ్ళు చేతులు వణుకులు చూచి వాళ్ళందరు పక్కున నవ్వారు. అః! నవ్వితే వాళ్ళ పళ్ళే బైటపడ్డాయి. అంతేనా.

వారు మళ్ళీ ప్రారంభించారు. రేపు ఓం ప్రథమం అంటూ యీ కమ్యూనిస్టులు చేసేపని యిదట: రిజర్వు పోలీసులను తీసుకొని పల్లెటూళ్లలో కొమ్ములు తిరిగిన రైతుల యిళ్లలో దూరి పాతాళంలో దాచిన ధాన్యాన్ని పెళ్లగించి ఇంతకాలం న్యాయమైన ధరలకు అమ్మకుండా వున్న నేరానికిగాను వాళ్ళకు ఖరీదు చెల్లించకుండానే తెచ్చి బజారుకేస్తారట. ఈ పని తప్పదట.

బట్టల వ్యాపారస్తుల మీద కూడా ఇలాగే దాడి చేస్తారట.

ఏం కర్మమోగాని వాడు చెప్పేవన్నీ నాకు మా ధర్మరాజుకు అన్వయించేవే! వాడిమాటలు చెబుతూంటే నేను వినలేక చెవులు మూసుకున్నా. కాని ఇంతలోకే నా అదృష్టమో అంటూ బండి సెంట్రల్ స్టేషనులో ఆగింది.

ప్రత్యేక ఆంధ్రరాష్ట్రము ఏర్పడు సూచనలు ఆశాంతములందు గూడ నేడు గాన్పింపవు. ఏర్పడు నిమిత్తములును గానరావు; పొడగట్టవు. అన్నియు నెచ్చట చూచినను దుర్నిమిత్తములే కానవచ్చుచున్నవి. నలుబదియేండ్లుగా సాగుచున్న ఆంధ్రోద్యమము మెట్టపట్టిన యోడ చందాన నున్నది. ముందు వెనుకలు రెండును గూడ అగమ్యగోచరములుగా నున్నవి. ఈ పట్టున కర్తవ్యము గూడ తోపకున్నది. ప్రత్యేకాంధ్రరాష్ట్రము ఏర్పడదేమో యని శంక కూడ జనుల మనసున నాటుకొన్నది—భావరాజు వేంకట కృష్ణారావు.